క్లుప్తంగా

ఘనంగా రామకృష్ణ పరమహంస జయంతి



పీబీ దేవంలో ఉచిత హోమియో వైద్య శిబిరం

సామర్లకోట: రామకృష్ణ పరమహంస జయంతిని శనివారం పీబీ దేవం గ్రామంలోని శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సేవా సమితి కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రామకృష్ణ పరమహంసం జీవిత విశేషాలను ఈ సందర్భంగా తెలియజేశారు. రామకృష్ణపరమహంస జయంతిని పురస్కరించుకొని గ్రామంలో ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్, సేవా సమితి గౌరవ అధ్యక్షుడు వింజమూరి సుబ్రహ్మణ్య శర్మ, సభ్యులు, నువ్వుల బాబ్జి, సూర్యచంద్ర రావు, తేలుగుంట్ల నరసింహారావు, తోటకూర దుర్గా లక్ష్మీ, తడాల దొరబాబు, టీవీఎస్ఎస్ సాయి వంశీ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత భద్రతతోనే సామాజిక భద్రత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జీఎం, హెచ్ఎంలు

సామర్లకోట: వ్యక్తిగత భద్రత ద్వారానే సామాజిక భద్రత సాధ్యపడుతుందని, విద్యార్థి దశ నుంచి రోడ్డు సేఫ్టీపై అవగాహన ఏర్పరుచుకోవాలని వెంకట్రామ ఆయిల్ ఇండస్ట్రీస్ జనరల్ మేనేజరు ఎస్.రామోహనరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో ఇండస్ట్రీస్ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ మేరకు హెచ్ఎం సాయిరామకృష్ణ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు రహదారి భద్రత నియమాలు, వీటీ పరిశ్రమల్లో భద్రతకు తీసుకునే ఏర్పాట్ల గురించి అవగాహన పెంచుకోవడానికి వీలుంటుందన్నారు. ప్రతి ఇంటిలోని గ్యాస్ స్టవ్ వినియోగం రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై.సత్తిరాజు, ప్రసాద్, ఏఎల్వీ కుమారి పాల్గొన్నారు.

బీజేపీ నూతన కార్యవర్గం



బీజేపీ నూతన కార్యవర్గం

పిఠాపురం: బీజేపీ పిఠాపురం పట్టణ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఓలేటి వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక సూర్యరాయ గ్రంథాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పట్టణ నూతన కార్యవర్గం ప్రకటించామన్నారు. పట్టణ ఉపాధ్యక్షులుగా లింగంపల్లి రవీంద్ర బాబు, బండే శ్రీనివాస్, పెద్దింటి రెడ్డి, రెడ్డిపల్లి కొండలరావు, సోమరౌతు జ్యోతి, గరగ వీర బాబు, ప్రధాన కార్యదర్శులుగా దొడ్డి లక్ష్మీనారాయణ, కంబాల నాగేశ్వరావు, కార్యదర్శులుగా వానపల్లి రమణ, అల్లిబోయిన నందకిషోర్, కోశాధికారిగా దంగేటి నాగేశ్వరరావులతో పాటు పట్టణ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరుగురు ఉపాధ్యక్షుడు, ఇద్దరు ప్రధాన కార్యదర్శులు ఇద్దరు కార్యదర్శులు, ఒక కోశాధికారిని నియమించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శిలు దాట్ల వెంకట సూర్యనారాయణ రాజు, గండి కొండలరావు, సీనియర్ నాయకులు తోట ఏడుకొండలు, బుర్రి మురళీధరరావు, మాజీ పట్టణ అధ్యక్షులు యాళ్ల కృష్ణారావు, పసుపులేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి




కొత్తపల్లిలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న రవికుమార్

కొత్తపల్లి: గ్రామాల్లో ఉన్న చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ అన్నారు. మండలంలోని వాకతిప్ప, కొత్తపల్లి, ఉప్పాడలో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండలంలో నిర్మాణంలో ఉన్న కేంద్రాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వేంట ఈవోపీఆర్డీ హరికృష్ణ సత్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూలే దశలో క్వార్టర్స్

- శిథిలావస్థకు చేరిన భవనాలు
- అద్దె ఇంట్లోనే పోలీసులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



శిథిలమైన పెద్దాపురంలోని పోలీసు క్వార్టర్లు

పెద్దాపురం: పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయి. అక్కడే ఉన్న ఎస్సై క్వార్టర్ కూడా అదే పరిస్థితిలో ఉంది. వీటిలో కొన్నేళ్లుగా ఎవరూ నివాసం ఉండడంలేదు. దీంతో కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. క్వార్టర్స్ సక్రమంగా లేకపోవడంతో రక్షకభటులు అద్దె ఇళ్లల్లో ఉంటున్నారు. శాంతి భద్రతలను కాపాడాల్సిన రక్షక భటుల నివాస గృహాలు అవసానదశకు చేరకోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి.

ఇదీ పరిస్థితి

పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉండే కొండయ్యపేటను ఆనుకుని పోలీసులకు 36మంది పోలీసులతోపాటు ఎస్ఐ, సీఐ క్వార్టర్లతో కూడిన పక్కా భవనాలను ఎస్ఐ, సీఐకి ప్రత్యేకంగా భవనాలను నిర్మించారు. అప్పట్లో ఈ స్టేషన్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు ఈ క్వార్టర్లను కేటాయించారు. సుమారు 20 ఏళ్లుగా ఈ సముదాయానికి కనీస మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. ప్రస్తుతం ప్రమాదభరితంగా ఉన్నప్పటికీ గత ఏడాది వరకు రెండు క్వార్టర్లలో పోలీసు కుటుంబాలు బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీశాయి. చిన్న చిన్న మరమ్మతులకు జేబుల్లోంచే సొంత నిధులు ఖర్చు చేసుకోవాల్సి వస్తోందని పోలీసులు వాపోతున్నారు. ఈ క్వార్టర్లలో విద్యుత్ వైరింగ్ కాలిపోయి, బోర్డులు వేలాడుతున్నాయి. కిటికీ తలుపులు ఏనాడో ఊడిపోయాయి. తలుపులు కూడా రక్షణ ఇవ్వలేని దుస్థితిలో ఉన్నాయి. గోడలకు వేసిన సిమెంట్ పూత కూడా పెచ్చులూడి పడుతున్నాయి. బాత్రూంలకు తలుపులు పూర్తిగా ఊడిపోయాయి. తప్పని పరిస్థితిల్లో కాపురం ఉండాల్సి వస్తోందని పోలీసు కుటుంబాలు చెబుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ లేనేలేదు. శిథిల భవనాల ఆవరణలో తుప్పలు పెరిగిపోయి, విష పురుగులకు ఆవాసాలు మారాయి. స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాలప్పుడు మాత్రమే పోలీసులు తుప్పలు నరికి కాస్త శుభ్రం చేయడం,



నివాసయోగ్యంగా లేక పిచ్చితుప్పలతో ఉన్న ఎస్ఐ క్వార్టరు

తిరిగి తుప్పలు పెరిగిపోవడం జరుగుతూ వస్తోంది. క్వార్టర్లు శిథిలమైనందున వాటిస్థానే క్వార్టర్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పోలీసు సిబ్బంది కోరుతున్నారు.

సబ్ డివిజన్లో శిథిలస్థితిలో 165 క్వార్టర్స్

పెద్దాపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో సుమారు 165 పోలీస్ క్వాటర్స్ శిథిలస్థితికి చేరుకున్నట్టు పోలీస్ సిబ్బంది లెక్కలు చెబుతున్నాయి. కిర్లంపూడి, గండేపల్లి, కోటనందూరు తొండంగి పోలీస్ స్టేషన్‌కు క్వార్టర్స్ లేవు. మిగిలిన పెద్దాపురంలో 38, తునిలో 48, ప్రత్తిపాడులో 17, జగ్గంపేటలో 14, అన్నవరంలో 10, సామర్లకోటలో 25, రంగంపేటలో 13 క్వార్టర్స్ శిథిలస్థితికి చేరాయి. చాలా చోట్ల పోలీస్ సిబ్బంది అద్దె భవనాల్లోనే నివాసం ఉంటున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక

పోలీసు క్వార్టర్స్ శిథిలస్థితికి చేరుకున్నాయి. గతంలో క్వార్టర్స్ నివాసయోగ్యంగా లేవని ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. ఆర్అండ్‌బీ, పోలీసు అధికారులు క్వార్టర్స్‌ను పరిశీలించి, నివాసయోగ్యంగా లేవంటూ నిర్ధారించారు. దీనిపై నూతన భవన నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపించాం.



–మౌనిక, ఎస్ఐ, పెద్దాపురం

గోతులను పూడ్చే పనుల్లో ట్రాఫిక్ ఎస్సై



సామర్లకోట రైల్వే గేటు వద్ద గోతులలో మట్టి వేయిస్తున్న ట్రాఫిక్ ఎస్సై

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో రైల్వే గేటు వద్ద ఉన్న గోతులు కారణంగా ప్రతీ రోజు అనేక మంది చిన్న వాహనచోదకులు పడిపోతున్నారు. ఈ విషయాన్ని గమినించిన ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తన సిబ్బంది సహాయంతో గోతులు పూడ్చే కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం ప్రారంభించారు. ట్రాక్టర్లతో మట్టిని తీసుకొని వచ్చి గోతులలో వేయించడంతో కొంత మేరకు వాహన చోదకులకు రక్షణ ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు నిత్యం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరణ చేయడంలోనే తలమునలై ఉండే సమయంలోను ప్రజల కోసం ఆలోచన చేసి గోతులను పూడ్చే పనులు చేయడంతో వాహన చోదకులు ట్రాఫిక్ సిబ్బందిని అభినందించారు.

మరుగుదొడ్లు శుభ్రపర్చండి మహాప్రభో..!



ఆర్‌బీపట్నం పాఠశాల వద్ద నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు



ఆర్‌బీపట్నం పాఠశాలలో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

ఆర్‌బీపట్నం విద్యార్థుల నిరసన

పెద్దాపురం: విద్యకు అధిక ప్రాధాన్యనిస్తున్నామని చెబుతున్న కూటమి ప్రభుత్వం విద్యార్థుల వసతులను పట్టించుకోవడం లేదు. పాఠశాలల్లో విద్యార్థులు కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో విద్యకు ఇచ్చిన ప్రాధాన్యతపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం దృష్టి సారించిన దాఖలాల్లేవు. పాఠశాలల్లో నదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని చెప్పడానికి నిదర్శనం పెద్దాపురం ఆర్‌బీపట్నం హైస్కూల్ విద్యార్థులు శనివారం చేపట్టిన నిరసన కార్యక్రమమే. పాఠశాల ఆవరణలో మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానగా ఉండడంతో ముక్కు మూసుకుని దుర్వాసనల మధ్యనే విద్యార్థులు కాలం వెల్లదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు పాఠశాలల్లో ఇరువురు వ్యక్తులు మరుగుదొడ్ల నిర్వహణ, క్లీనింగ్ పని చేపట్టే వారని, చాలీచాలని జీతం కారణంగా ఒక్కరూ మాత్రమే అన్ని క్లీనింగ్ చేయడం వల్ల మరుగుదొడ్లు క్లీన్ చేసి 20 రోజులు కావస్తుందని, ప్రభుత్వ ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి మా సమస్య పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ నిరసన కార్యక్రమానికి స్కూల్ చైర్మన్ మన్యం చిన్న మద్దతు ఇచ్చి దీని పరిష్కారానికి విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

బడ్జెట్‌పై సీపీఎం నిరసన



పెద్దాపురంలో బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

పెద్దాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్ మాటలు కోటలు దాటాయని, నిధులు కోతలు తప్ప ప్రజలకు ప్రయోజనకరంగా లేదంటూ పెద్దాపురం పట్టణంలో శనివారం సాయంత్ర సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. బడ్జెట్ ప్రతులను దహనం చేసి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు డి.క్రాంతికుమార్, నీలపాల సూరిబాబు మాట్లాడుతూ బడ్జెట్ అంచనాల్లో ప్రజలను పట్టించుకున్న దాఖలాల్లేవన్నారు. బడ్జెట్‌ని సవరించి ప్రజలకు ఉపయోగపడేలా నిధులను కేటాయింపు జరపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిరిపురపు శ్రీనివాస్, జి.సత్తిబాబు, కేదారి నాగు, మాగాపు నాగు, మంతెన సత్తిబాబు, కూనిరెడ్డి అరుణ. అప్పన్న, కృష్ణ, సత్యన్నారాయణ., తైనాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- రెండు కేంద్రాల్లో 51 మంది గైర్హాజరు



సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

సామర్లకోట: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. సామర్లకోట, పెద్దాపురం మున్సిపాలిటీల పరిధిలోని ఇంటర్ విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న ప్రగతి జూనియర్ కళాశాలలను పరీక్షా కేంద్రాలుగా కేటాయించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరిగాయి. ప్రగతి జూనియర్ కళాశాలలో 499 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సిన ఉండగా 31 మంది గైర్హాజరు కాగా, 468 మంది విద్యార్థులు పరీక్షలు రాసిన్నట్టు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ పీఎస్ ప్రసాదరావు తెలిపారు. ఈ పరీక్ష కేంద్రంలో డీఓగా జి.లక్ష్మణ్‌కుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా జి.నాగబాబు వ్యవహరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 470 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 20 మంది గైర్హాజరు కావడంతో 450 మంది పరీక్ష రాసిన్నట్టు పరీక్షా కేంద్రం చీఫ్ పి.ఈశ్వర్ తెలిపారు. ఎండలను దృష్టిలో ఉంచుకొని పరీక్షా కేంద్రాల వద్ద హెల్త్ శిబిరాలను ఏర్పాటు చేశారు. సీఐ ఎ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చిన్నారుల ప్రతిభ



సైన్సు ఎగ్జిబిషన్‌లో చిన్నారుల ప్రదర్శన

సామర్లకోట: స్థానిక కొత్తూరులోని ప్రతిభా విద్యా నికేతన్‌లో చిన్నారులు జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా మంచి ప్రతిభను కనబరాచారు. గ్రూపులుగా ఏర్పాటు అయిన చిన్నారులు వివిధ సైన్సు ప్రాజెక్టులను ప్రదర్శన చేశారు. వెజిటబుల్స్, ఫ్రూట్ మార్ట్సు వారి తరగతుల సబ్జెక్టుల ఆధారంగా ప్రాజెక్టులను తయారు చేశారు. ప్రాజెక్టులలో తినకూడని జంక్ ఆహార పదార్థాలను నిషేదిస్తూ ప్రదర్శనలో పెట్టారు. చిన్నారులు డాక్టరు, రైతు, పోలీసు, సైనికుడు, అబ్దుల్ కలాం, గణిత శాస్త్ర వేత్త శకుంతలదేవి వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను పాఠశాల కరస్పాండెంట్ ఎస్‌వీవీజీ ప్రకాష్ ప్రారంభించారు. డైరెక్టరు సుధారాణి, ప్రిన్సిపాల్ టి.సునీత, వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీగౌరీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు,

వైభవంగా శ్రీపుష్పయాగం



శ్రీపుష్పోత్సవంలో ఏర్పాటు చేసిన దంపత తాంబూళాలు,



కొత్తపల్లిలో స్వామివారి శ్రీపుష్పయాగం నిర్వహిస్తున్న భక్తులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో ప్రసిద్ధిగాంచిన ఉమారామలింగేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలు శనివారం నిర్వహించిన శ్రీపుష్పోత్సవంతో వైభవంగా ముగిశాయి. ఆఖరి రోజు స్వామి, అమ్మవారికి శ్రీపుష్పయాగాన్ని పండితులు గణేష్ శర్మ పండిత బృందం ప్రత్యేక పూజలు చేసి, దంపతులకు దంపద తాంబూలాలు అందజేశారు. స్వామి, అమ్మవారిని ప్రత్యేక వేదికపై అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. స్వామివారిని, అమ్మవారిని ఉయ్యాల మంచం మీద ఆశీర్నీ చేయగా ముత్తైదువులు భక్తి గీతాలాపన చేశారు. అనంతరం సేవా సభ్యులు స్వామికి నివేదన చేసిన మధుర పదార్థాలు, పుష్పోత్సవం తాంబూలాలు భక్తులకు అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి వారు

కొత్తపల్లి: స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రాజశేఖరస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారి శ్రీపుష్పయాగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వార్ని పూలతో అలంకరించి వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముత్తైదువులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఆలయ అర్చకులు శర్మ, సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవాలు ముగినట్లు వారు తెలిపారు.

అపర్ణాదేవి ఆలయానికి ఉత్సవమూర్తులు



ఉత్సవమూర్తులు అందజేస్తున్న భక్తులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని అపర్ణాదేవీ సమేత నాగేశ్వరస్వామి ఆలయానికి ప్రధానార్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి, సూర్యలక్ష్మి దంపతులు, కుమార్తె డాక్టర్ నిమిషపూర్ణ, నాగ అపర్ణ ఉత్సవమూర్తులను సమర్పించారు. అపర్ణాదేవి అమ్మవారు వెలసి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సుమారు 50 కేజీల పంచలోహాలతో ఈ విగ్రహాలకు తయారు చేయించి, శనివారం సమర్పించారు. ఈ ఉత్సవమూర్తులకు మూడు రోజుల పాటు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో వేద పండితుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

- ఆటోలో బ్యాగ్ మర్చిపోయిన ఉద్యోగిని
- పోలీసులకు ఇచ్చిన ఆటో డ్రైవరు



ఉద్యోగినికి బ్యాగ్ అందజేస్తున్న పోలీసులు

పిఠాపురం: ఆటోలో ప్రయాణించిన ఒక ఉద్యోగిని ఆటోలో బ్యాగ్ మర్చి పోయింది. తరువాత చూసుకుని విషయాన్ని పోలీసులకు చెప్పగా వారు విచారణ చేసే లోపు ఆటో డ్రైవరు ఆ బ్యాగ్‌ను తెచ్చి పోలీసులకు అప్పగించాడు. శనివారం పిఠాపురం పట్టణంలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిఠాపురం జిల్లా కోర్టులో స్టెనోగా పని చేస్తున్న కాద అన్నపూర్ణ శనివారం ఉదయం పది గంటలకు కోర్టు డ్యూటీకి వెళ్లేందుకు పిఠాపురం ఉప్పాడ సెంటర్‌లో ఆటో ఎక్కి కోర్టు వద్ద దిగే సమయంలో తన బ్యాగ్‌ను ఆటోలో మర్చి పోయింది. ఆ బ్యాగ్‌లో డేటా ఉన్న పెన్‌డ్రైవ్, అరకాసు బంగారం, రూ.2500, సెల్ ఫోన్ ఉన్నాయి. దీంతో కంగారు పడిన ఆమె వెంటనే పిఠాపురం పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన సీఐ జి శ్రీనివాస్, ఎస్సైలు మణి కుమార్, ఎస్‌కే బాషా విచారణ చేస్తుండగా ఆటో డ్రైవరు వచ్చి తన ఆటోలో ఒకామె ఈ బ్యాగ్ మర్చి పోయారంటు పోలీసులకు అందజేశాడు. వెంటనే ఆమెను పిలిచి బ్యాగ్ అందజేసిన పోలీసులు ఆటో డ్రైవరును అభినందించారు.

శృంగార వల్లభుని సన్నిధిలో భక్తుల కిటకిట

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభ స్వామి వారిని శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని సుమారు 20 వేల మంది దర్శించుకున్నారని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఆలయంలో వివిధ సేవలు, కేశఖండన టికెట్లు, విరాళాల ద్వారా దేవస్థానానికి రూ.3,36,168 ఆదాయం సమకూరింది. స్వామివారిని అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 5 వేల మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం చేశామని ఈఓ తెలిపారు.



స్వామి సన్నిధిలో భక్తజన కోలాహలం

విద్యార్థుల రక్షణ చర్యలపై దృష్టి

కొత్తపల్లి: హాస్టల్లో విద్యార్థుల రక్షణపై దృష్టి పెట్టిలని, పూర్తిస్థాయిలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని ఎస్సై వెంకటేష్ అన్నారు. మూటపేలలో ఉన్న బాలికల, బాలుర హాస్టల్లో శనివారం ఆయన పరిశీలించారు. హాస్టల్లో ఉన్న సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

కుక్కుటేశ్వరా.. కరుణించావా..!

- లెక్క తప్పకుండా.. చిక్కు లేకుండా...!!
- ప్రశాంతంగా ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు
- ఊపిరి పీల్చుకున్న అధికారులు

పిఠాపురం: ఊహించిన దాని కంటే జనం ప్రభంజనంగా మారినా అధికారులు చేపట్టిన పటిష్టమైన చర్యలతో పిఠాపురం పాదగయ కుక్కుటేశ్వరస్వామి వారి మహా శివరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గత నెల 24 నుంచి 28 వరకూ నిర్వహించిన కుక్కుటేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు, మహా శివరాత్రి పుణ్య స్నానాలు దిగ్విజయంగా పూర్తయ్యాయి. ఈఏడాది కేవలం లక్ష మంది మాత్రమే భక్తులు వస్తారని అధికారులు అంచనా వేయగా »లెక్క తప్పితే చిక్కులే« అనే శీర్షికన సాక్షి దిన పత్రికలో రానున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా చర్యలు తీసుకోక పోతే చిక్కులు తప్పవని కథనం వెలువడడంతో అధికారులు దానికి అనుగుణంగా భారీ ఏర్పాట్లు చేశారు. దీంతో భక్తుల సంఖ్య రెండు లక్షలు దాటినా ఏ ఇబ్బంది లేకుండా పుణ్య స్నానాలు దర్శనాలు పూర్తయ్యాయి. జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ బిందుమాధవ్ ప్రత్యేక దృష్టి సారించి పటిష్టమైన చర్యలు తీసుకునేలా సమీక్షల ద్వారా స్థానిక అధికారులకు సూచనలు ఇవ్వడంతో పాటు నిత్యం పర్యవేక్షణ చేయడంతో ఉత్సవాల్లో ఎటువంటి అవాంతరాలు ఎదరు కాకుండా విజయవంతంగా పూర్తయినట్టు భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎటవుంటి ఒడిదొడుకులు లేకుండా వచ్చిన ప్రతి భక్తుడు పుణ్య స్నానాలు, దర్శనాలు పూర్తి చేసుకోవడంతో అధికారుల్లోను ఆనందం వ్యక్తమవుతోంది. పాదగయ ఈఓ జగన్మోహన్ శ్రీనివాస్, సీఐ జి.శ్రీనివాస్ 20 రోజుల ముందు నుంచే ఏర్పాట్లు చేయడంతో పాటు దగ్గరుండి ఏర్పాట్లు చేయడంతో ఉత్సవాలు విజయవంతం అయినట్లు భక్తులు వారిని అభినందిస్తున్నారు.



రథోత్సవంలో ఈఓ జగన్మోహన్ శ్రీనివాస్, సీఐ జి శ్రీనివాస్‌లను సత్కరిస్తున్న భక్తులు

కృతజ్ఞతలు

ఈ ఏడాది ఊహించిన దానికంటే భక్తులు అధికంగా వచ్చినా ఉన్నతాధికారుల ఆదేశాలతో పటిష్టమైన చర్యలు తీసుకోవడంతో ఉత్సవాలు విజయవంతమయ్యాయి. ముఖ్యంగా భక్తులు పూర్తి సహాయ సహకారాలు అందించారు. మేము సూచించిన విధంగా భక్తులు క్యూలైన్లు నిబంధనలు పాటించి దర్శనాలు పుణ్య స్నానాలు చేయడం వల్లే ఏ ఇబ్బంది తలెత్తలేదు. అందుకే భక్తులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఎక్కువగా సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇవ్వడంతో అందరు పూర్తిగా సహకరించారు. అన్ని శాఖల అధికారుల సహకారం మరువలేనిది.

– కె జగన్మోహన్ శ్రీనివాస్, ఈఓ పాదగయ క్షేత్రం

భక్తుల సహకారం

ఉన్నతాధికారుల ఆదేశాలతో వారి సూచనల మేరకు ఏర్పాట్లు పటిష్టంగా చేశాం. దానికి తగ్గట్టుగా భక్తులు పూర్తి సహకారం అందించారు. క్యూలైన్లు పటిష్టంగా ఏర్పాటు చేయడంతో పాటు భక్తులకు ఇబ్బంది లేకుండా స్నానాలకు దర్శనాలకు వదలడంతో సమస్యలు లేకుండా అన్ని పూర్తయ్యాయి. అంచనాకు మించి భక్తులు వచ్చినా ఏ ఇబ్బంది తలెత్తలేదు. ఇందులో భక్తుల సహకారం చాలా ఉంది. ఉత్సవాల ప్రారంభం నుంచి చివరి వరకు ఎక్కడా చిన్న ఇబ్బంది కూడా లేకుండా ఏర్పాట్లు చేసి విజయవంతంగా పూర్తి చేసినందుకు చాలా సంతోషంగా ఉంది.

– జి శ్రీనివాస్, సీఐ. పిఠాపురం